

బిగించి, ఎదురుగా ఉన్న మేడనెక్కి.. చేతులు సారించి కేవలం పది చంక్రమణలతో నేలకు దిగాడు. నందరాజు ముందుకు వచ్చి, రెండు భుజాలపై అరచేతులతో కొట్టు కొంటూ దండ చరిచాడు.

ఆ ప్రదర్శన చూసి, నందరాజు చిన్నపిల్లాడిలా చప్పట్లు కొట్టాడు. కాసేపాగి..

''నీ తండ్రి పేరేమిటి?! ఆయన ఎక్కడున్నాడు?'' అని అడిగాడు.

''ఆయన పేరు నాగరాజు. విదేశాలలో ఉన్నాడని నా తల్లి చెప్పింది'' అని చెప్పాడు ఫణిదత్తుడు.

''ఇతను నీ తండ్రినని వాదిస్తున్నాడు. నిజమేనా?''.

''కాదు మహారాజా! వీడు పాటలీపుత్రానికి వస్తుంటే దారిమధ్యలో మమ్మల్ని అడ్డగించాడు'' అంటూ జరిగిన కథనంతా రాజుతో వివరించి చెప్పాడు ఫణిదత్తుడు.

వెంటనే..

''వీడిని చెరసాలలో తోసేయండి'' అని ఆజ్ఞాపించి..

''పద! నీ తదుపరి చదువు మా నగరంలోనే కొనసాగి ద్దువుగానీ'' అంటూ ఫణిదత్తుణ్ని తీసుకుని బయల్దేరాడు నందరాజు.

నందభూపాలునికి వ్యాయామాగమం అంటే చాలా ఇష్టం. ఆ విద్యను తన నగరంలో అభివృద్ధి చేసేందుకు కంకణం కట్టుకున్నాడు. దేశవిదేశాలనుంచి మల్లయుద్ధ వీరులను రప్పించి.. పెద్ద మల్లశాల కట్టించి, అనేకమంది పిల్లలకు శిక్షణనిప్పిస్తున్నాడు. నందరాజు కుమారుడైన రుక్మవర్మ కూడా ఆ పాఠశాల విద్యార్థిగానే ఉన్నాడు.

''ఈ పిల్లవాడొక మల్లుడు. ధారానగరం నుంచి వచ్చాడు. ఇకముందు మన పాఠశాలలో చదువుతాడు. ఇప్పుడు మన విద్యార్థులలో ఎవరైనా వీడితో కుస్తీ పట్టగ లరా?!'' అని ఫణిదత్తుణ్ని చూపించి, పాఠశాలలోని పిల్ల లను అడిగాడు నందరాజు.

సుబాహుడు, సుప్రహస్తుడు, వజ్రకాయుడు అనే ముగ్గురు పిల్లలు దండలు చరుస్తూ ముందుకు వచ్చారు. ముగ్గురూ విడివిడిగా ఫణిదత్తునితో మల్లయుద్ధం చేశారు. తన తాడన నైపుణ్యంతో ఫణిదత్తుడు వాళ్లు ముగ్గురినీ సులభంగా ఓడించి.. మల్లాడి మల్ల చరిచాడు.

తరువాత రాజు తన కుమారుడు రుక్మవర్మను పిలిచి..

''నువ్వు కూడా వెళ్లు'' అన్నాడు.

కానీ, ఉపాధ్యాయులు వారించారు.

''రాకుమారుడు పసివాడు కదా మహారాజా! మరి కొంత శిక్షణ అవసరం'' అన్నారు.

అప్పుడు నందుడు ఫణిదత్తుణ్ని కౌగిలించుకుని..

''శ్రద్ధగా నేర్చుకో నాయనా!'' అని వెళ్లిపోయాడు.

నిజానికి రుక్మవర్మ కన్నా ఫణిదత్తుడే చిన్నవాడు. కానీ, అతనిముందు విద్యలో రాకుమారుడే చిన్న. ఇది రుక్మవర్మకు కష్టంగా తోచింది. అనుక్షణం పాఠశాలలో ఏదో ఒక విషయంలో ఫణిదత్తుణ్ని చిన్నబుచ్చుతూనే ఉండేవాడు. ఫణిదత్తుడు తానై పిలిస్తే వినిపించుకునే వాడు. పలకరించకపోతే ఆక్షేపించేవాడు.

సుబాహుడు, ప్రహస్తుడు, వజ్రకాయుడు మాత్రం.. తొలినాడే ఫణిదత్తునికి ఆప్తమిత్రులైపోయారు. నలు గురూ ఆ పాఠశాలలోనే ఉత్తమశ్రేణిలో నిలిచేవారు.

భీమునిపట్ల దుర్యోధనునికి ఉన్నట్లుగా.. రుక్మవర్మ మాత్రం ఫణిదత్తుడితో ఈర్ష్యతోనే మెలిగేవాడు. కాలక్ర మంలో ఫణిదత్తునికి పద్దెనిమిదేళ్ల వయసు వచ్చింది.

* * *

ఒకనాడు చేతిలో ఒక పత్రికతో నందుడు పాఠశాలకు వచ్చాడు. విద్యార్థుల సాముగరిడీలను పరిశీలించాడు.

చివరిగా ఫణిదత్తుని చేయిపట్టుకుని..

''నాయనా! నీ జెట్టితనం ప్రశంసనీయంగా ఉంది. ఇదిగో.. మనకు కాశీనుంచి ఆహ్వానపత్రిక వచ్చింది. అక్కడ మల్లయుద్ధ పోటీలు జరగబోతున్నాయట. గెలిచి నవారికి రతనాల గండపెండేరం ఇస్తారట. మన పాఠశా లలో సమర్థులైన విద్యార్థులుంటే పంపమని రాశారు. యువరాజుతోపాటు మీ నలుగురూ, మరికొంతమంది కలిసి కాశీకి వెళ్లిరండి. రేపే ప్రయాణం'' అని చెప్పాడు.

తండ్రిమాటలు రుక్మవర్మకు బొత్తిగా రుచించ లేదు. కానీ, మారుమాట్లాడే ధైర్యం లేకపోయింది. మేలుజాతి గుర్రాలనెక్కి వీరులందరూ కాశీకి ప్రయాణం కట్టారు. నెల వ్యవధిలో కాశీకి చేరుకున్నారు. కాశీరాజు వీరికి తగిన విడిదిని ఏర్పాటు చేశాడు.

పోటీలు ప్రారంభమయ్యాయి. దేశదేశాలనుంచి వంద లకొద్దీ మల్లవీరులు వచ్చారు. ఆ పోటీలు సుదీర్ఘంగా ఆరునెలలపాటు కొనసాగాయి. అక్కడకూడా రుక్మవర్మ ఎప్పుడూ ఫణిదత్తునితో కలిసేవాడు కాదు. మిగిలినవా రిని కూడగట్టుకుని అతనిపై కుట్రలు పన్నుతుండేవాడు. ఫణిదత్తుడు చేసే సాధనల వివరాలను ఇతర యోధులకు మిత్రధర్మంగా తెలియచేస్తూ.. అతణ్ని వదిస్తే బహుమాన మిస్తానని చెబుతుండేవాడు.

అది తెలిసి, సుబాహుడు మొదలైన ముగ్గురూ ఫణి దత్తుణ్ని ఎప్పుడూ ఒంటరిగా విడిచిపెట్టేవారు కాదు. మొత్తంమీద ఆరునెలల తరువాత పోటీలలో దక్షిణాదికి చెందిన వీరమల్లుడనేవాడు విజేతగా నిలిచాడు. మిగిలిన పాఠశాలల వాళ్లందరూ వాడికి దాసోహమని పలికారు.

చివరి రోజున కాశీరాజు..

''రుక్మవర్మా! ఇంక మీ పాఠశాల వంతు మిగిలింది. మీలో వీరమల్లునితో పోరగలవారుంటే ముందుకు రావచ్చు'' అని పలికాడు.

అప్పుడు రుక్మవర్మ పైకి లేచి..

''మహారాజా! ఈ వీరమల్లుని ప్రతాపం చూస్తూనే ఉన్నాం. అతని దేహం వజ్రపుముక్కే కానీ, చర్మాస్తి మయం కాదు. ఆరునెలల నుంచి ఒంటిచేత్తో ఎదురొడ్డిన ప్రతివారినీ గెలుస్తూనే ఉన్నాడు. కొద్దిగా కూడా చెక్కుచె దరలేదు. వానితో పోరాడగలిగేవాడు మా పాఠశాలలో నేను తప్ప మరెవరూ లేరు. కానీ.. నాకీ ఊరు వచ్చింది మొదలు నీరుపడక దేహంలో స్వస్థత లేదు. ఇప్పుడు నేను పోరాడలేను. కనుక మీరు గండపెండేరం అతనికే ఇవ్వవచ్చు'' అన్నాడు.

''సరే!'' అని సభనుద్దేశించి, వీరమల్లుని గెలుపును ప్రకటించే ముందుగా..

''ఓ మహాయోధులారా! ఈ జెగజ్జెట్టితో తలపడేవా రింకా ఉంటే మందుకు రావచ్చు'' అని చాటాడు.

ఆ మాటలు విని, సుబాహుడు ముందుగా పైకి లేచాడు. అతని తరువాత ప్రహస్తుడు, వజ్రకాయుడు ఒకరి తరువాత ఒకరుగా వీరమల్లునితో ద్వంద్వయుద్ధా నికి తలపడ్డారు. కానీ, ఎవరూ నిలవలేకపోయారు.

చివరిగా ఫణిదత్తుడు ముందుకు వచ్చాడు. దండలు చరుస్తూ వీరమల్లునితో కలబడి అతిభీకరమైన విద్యా ప్రదర్శనం చేశాడు. వారి యుద్ధం మూడురోజులపాటు కొనసాగింది. మూడోనాడు ఫణిదత్తుడు వీరమల్లుణ్ని ఎత్తి కిందపడవేశాడు. జయసూచకంగా మల్ల చరిచాడు.

సభాసదులందరూ జయజయ ధ్వానాలు పలికారు.

ఫణిదత్తుని గెలుపును తట్టుకోలేనివారు రుక్మవర్మతో పాటు ఆ సభలో మరికొందరు కూడా ఉన్నారు.

''ఆరునెలల నుంచి అలసిపోయి ఉన్నవాణ్ని గెల వడం గొప్పతనం కాదు. తగినంత విరామం ఇచ్చి.. ఆ తరువాత మరోసారి ఫణిదత్తుడు అతనితో తలప డాలి'' అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

''సరే! మీరు చెప్పినట్లే మరోసారి పోటీచేసి వీడినెత్తి కుదెయ్యకపోతే.. వీడి చెప్పులు తలమీద మోస్తాను'' అని శపథం చేశాడు ఫణిదత్తుడు.

కాశీరాజు విస్మయుడవుతూ.. తదుపరి పోటీకి నెలరో జుల గడువు పెట్టాడు. అంతవరకూ పోటీకి వచ్చిన మల్ల వీరులందరూ కాశీపట్టణంలోనే విహరించసాగారు.

* * *

ఒకనాడు ఫణిదత్తుడు సుబాహుడు మొదలైనవారితో కలిసి గంగానదిమీద నౌకావిహారం చేస్తున్నాడు. గంగా తరంగాలమీద ఊయలలూగుతున్న నీటిపక్షులను చూస్తూ.. పూలసువాసనలతో కూడిన పిల్లగాలులను ఆస్వాదించసాగాడు. ఆ సమయంలో సాయంకాల సూర్యునిలా ఎర్రనైన ముఖం ఒకటి తటాలున నదిపైకి తేలి అంతలో మునిగిపోవడం అతని కంటపడింది. వెంటనే రత్నకంకణాలు, అంగుళీకాలు దాల్చిన రెండు చేతులు పైకి లేవడం చూశాడు.

''నావను ఆపండి. ఎవరో మునిగిపోతున్నారు'' అని అరిచాడు ఫణిదత్తుడు.

అతను చూపించినవైపు చూస్తే మిగిలినవాళ్లకు ఏమీ కనిపించలేదు. అప్పుడు నావికులు..

''వద్దు బాబూ! అది మొసలి లాంటిది. దిగిన వారిని పట్టి చంపుతుంది. ఇంతకుముందు నీలాగే జాలిపడి నీటిలో దూకినవాళ్లెవరూ తిరిగి రాలేదు'' అని చెప్పారు.

ఇంతలో అదే దృశ్యం మరోసారి ఫణిదత్తుని కళ్ల ముందు కదలాడింది. వెంటనే మరేమీ ఆలోచించ కుండా ఫణిదత్తుడు నీటిలోకి దూకాడు. వేగంగా ఈదు కుంటూ వెళ్లి ఆ రెండుచేతులనూ పట్టుకుని పైకి లాగబో యాడు. వెంటనే ఆ వనిత ఇనుపగుండులా బరువైపో యింది. తనతోపాటు ఫణిదత్తుణ్ని కూడా నీటి అడుగుకు లాక్కుపోయింది.

సుబాహుడు మొదలైన మిత్రులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా నదిలోకి దూకారు. ఆ రోజంతా ఫణిదత్తుని గురించి వెతుకుతూనే ఉన్నారు. కానీ లాభం లేకపో యింది. నీటివాలున ఫణిదత్తుడు కొట్టుకుపోయాడని, ఈపాటికి మరణించి ఉంటాడని నిర్ధారణకు వచ్చారు. ■

**(వచ్చేవారం.. వరుణ కన్యకలు)**